

ఉద్యోగ అవకాశాలు కల్పించండి

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. – 8లో



బాబును నమ్మలేం

నరకాసురుడినైనా నమ్మొచ్చు.. చంద్రబాబును మాత్రం నమ్మలేమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. – 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	26
తిరుపతి	36	26
తిరుమల	31	22
గూడూరు	39	28
నగరి	37	27

న్యూస్‌రీల్

స్పందన సమస్యలకు ప్రాధాన్యతనివ్వండి



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: స్పందనలో ప్రజలు ఇచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ప్రజలు స్పందనలో పాల్గొని, అర్జీలు అందజేశారు. స్పందన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి వినతులు స్వీకరించారు. పలు శాఖల అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్పందనలో పలు శాఖలకు సంబంధించి 227 అర్జీలు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

69 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఎంపిక చేసిన 69 సచివాలయాలల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. జిల్లాలోని 134 గ్రామాల్లోని ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను 69 సచివాలయాలల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. వారం రోజుల్లో మొత్తం 70 రిజిస్ట్రేషన్లు జరగగా వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.10.11 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు.

ముగిసిన రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లాలో సోమవారంతో రేషన్ పంపిణీ ముగిసింది. ఈ నెల ప్రారంభం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభించగా..రాత్రి వరకు 88 శాతం పంపిణీ జరిగింది. అధికారులు పంపిణీ అమలు తీరును పర్యవేక్షిస్తూ.. పగడ్బందీగా జరిగేలా చూశారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–2025 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఆ మేరకు తిరుపతి వరదరాజ నగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధిస్తే అత్యున్నత ప్రమాణాలతో సీబీఎస్ఈ సిలబస్‌తో ఉచితంగా చదువు, వసతి కల్పిస్తారని, రెగ్యులర్ చదువుతో పాటు నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు సైతం శిక్షణ ఇస్తారని తెలిపారు. జవహర్ నవోదయ పాఠశాలలు దేశ వ్యాప్తంగా 649 ఉన్నాయని, వీటిలో మన రాష్ట్రంలో 15, తెలంగాణలో 9 పాఠశాలలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఒక్కో నవోదయ విద్యాలయంలో గరిష్టంగా 80 మంది విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ విద్యాసంవత్సరంలో చదువుతున్న వారు అర్హులని తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ ప్రవేశ పరీక్షను జనవరి 20, 2024లో నిర్వహిస్తారని, దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 10వ తేదీ వరకు గడువు ఉన్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

విజయా డెయిరీలో అమూల్ ప్రతినిధుల పరిశీలన



విజయా డెయిరీలోని భవనాలను పరిశీలిస్తున్న, అమూల్ సంస్థ ప్రతినిధులు

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు విజయా డెయిరీని సోమవారం అమూల్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. విజయా డెయిరీని పునఃప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇటీవల డెయిరీ నిర్వహణను అమూల్ సంస్థకు ప్రభుత్వం అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమూల్ సంస్థ డెయిరీని పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా డెయిరీ నిర్మాణ పనులకు త్వరలోనే పునాది వేయనున్నారు. ఈ క్రమంలో అమూల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి అమర్‌జీత్‌సింగ్, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి విక్రమ్‌చౌడలు డెయిరీని సందర్శించారు. డెయిరీ పరిధిలోని భవనాలు, యంత్రాలు భవిష్యత్తులో ఏమాత్రం ఉపయోగపడతాయన్న విషయాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజర్ రవికుమార్, ఏఈ సుష్మిత, డీసీఓ వనజ పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ షణ్మోహన్



జగనన్న సురక్ష కార్యక్రమం అమలు తీరు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

సుపరిపాలనకే సురక్ష

నాడు: సమస్యలున్నా.. సర్టిఫికెట్లు కావాలన్నా.. ఊరి జనం మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు.. అయినా కనికరించని అధికార గణం.. పథకాల అమలులో జన్మభూమి కమిటీల పెత్తనం..వెరసి సామాన్యులకు వ్యయ ప్రయాసలు.. అందని సర్టిఫికెట్లు.. పథకాలు.. పరిష్కారానికి నోచుకోని సమస్యలు.. ఇది నాడు పరిపాటి.

నేడు: మీ ఇంట్లో ఏమైనా సమస్యలున్నాయా? మీకు ప్రభుత్వ పథకాలు అందడం లేదా? సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం జరుగుతుందా? పట్టాదారు పాసుపుస్తకాలకు చేసుకున్న దరఖాస్తులో సమస్యలున్నాయా?.. మీకు ఏ రకమైన ఇబ్బందులున్నాయో చెప్పండి పరిష్కరిస్తామని అధికారులే మన ముంగిటకు వస్తున్నారు. ఏ కమిటీల పెత్తనం లేకుండా ప్రజల చెంతకే సంక్షేమ పథకాలను చేరుస్తారు. ఇందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేయనుంది. ఇదీ నేటి వైఎస్సార్ సీపీ సుపరిపాలన.

అర్హులై ఉండి మీకు పథకాలు అందలేదా.. అయితే దిగులు పడొద్దు.. ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం.. అర్హులెవరికీ అన్యాయం జరగకూడదన్న లక్ష్యం.. అంతే కాదు ప్రతి సమస్యా తక్షణమే పరిష్కారమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగానే ప్రతి ఊర్లో.. గడప గడపకు అధికారగణం వెళ్లి.. జన ఇబ్బందులపై ఆరా తీసి.. తక్షణ పరిష్కారానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నారు.

- ప్రభుత్వ పథకాలు, సమస్యలపై ఆరా
- క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల నిశితపరిశీలన
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు
- ఈ నెల 23 నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రజా సమస్యలను సంతృప్తిస్థాయిలో పరిష్కరించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం అమలవుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం కలెక్టర్ షణ్మోహన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై సూచనలిచ్చారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు.

తొలుత గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో..

జగనన్న సురక్ష పథకాన్ని తొలుత గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 612 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 800కు పైగా సచివాలయ ఉద్యోగులు, 9,221 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరందరితో కలసి ప్రజాప్రతినిధులు, గృహసారథులు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారు. ప్రతి ఇంటినీ సందర్శించి, అక్కడ అర్హత ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందడం లేదా? అని విచారిస్తారు. వివిధ రకాల సర్టిఫికెట్లు పొందడంలో ఏవైనా ఇబ్బందులున్నాయా? అని నిశితంగా పరిశీలించి, సమస్యలున్నట్‌లెతై వివరాలను నమోదు చేసుకుంటారు.

రెండో దశలో ఇలా..

రెండో దశలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా మండలాల్లో ఉన్న సచివాలయాల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తారు. క్యాంపులను ఆయా శాఖల జిల్లా అధికారులు సందర్శిస్తారు. ఈ కార్యక్రమాన్ని జూలై ఒకటి నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తారు. అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి, వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను అదే రోజు ఇవ్వనున్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంగా, తహసీల్దార్, పంచాయతీరాజ్ ఈఓని రెండో బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల కమిషనర్, సిబ్బంది ఒక బృందంగా, నగరపాలక కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌ల బృందాలను ఏర్పాటు చేసే పనిలో కలెక్టరేట్ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలను పొందలేని వారు ఉన్నట్‌లెతై వారిని అర్హులుగా గుర్తిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలవుతున్న సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న వారు నష్టపోకుండా ఉండేలా జగనన్న సురక్ష కార్యక్రమంలో పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో వివిధ పథకాలకు అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు ఒకటో తేదీన పథకాలు మంజూరు చేస్తారని అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించాం. క్యాంపులను పర్యవేక్షించాలని నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించాం. కార్యక్రమం నిర్వహణపై సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నాం.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

జాతీయ బీసీ మహాసభకు రండి



మంత్రి పెద్దిరెడ్డితో నాయకులు కేసన్న, శంకర్రావు, జ్ఞానజగదీష్

- మంత్రి పెద్దిరెడ్డిని ఆహ్వానించిన నేతలు

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతిలో ఆగస్టు 7వ తేదీన నిర్వహించనున్న 6వ జాతీయ బీసీ మహాసభకు రావాలని విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బీసీ నాయకులు ఆహ్వానించారు. సోమవారం తిరుపతిలోని మంత్రి కార్యాలయంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన్న శంకర్రావు, రాయలసీమ సమన్వయకర్త జ్ఞానజగదీష్, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజుగౌడ్‌లు మంత్రిని కలిశారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 6వ జాతీయ బీసీ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అలాగే పలు రాష్ట్రాల బీసీ పార్లమెంటు సభ్యులను ఆహ్వానించామన్నారు. 28 రాష్ట్రాల నుంచి జాతీయ బీసీ ప్రతినిధులు రానున్నట్లు పేర్కొన్నారు. మండల్ కమిషన్ సిఫార్సు మేరకు బీసీలకు ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు ప్రకటించిన ఆగస్టు 7వ తేదీకి గుర్తుగా ఏపీ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఏటా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముంపు గ్రామాల బాధితులను ఆదుకుంటాం

- పరిహారం ఎక్కువ ఇప్పించేందుకు కృషి
- రైతులందరి ఆమోదంతోనే ముందుకెళతాం
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

సోమల: మండలంలోని ఆవులపల్లె సీతమ్మ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించిన ముంపు గ్రామాల బాధితులను ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆవులపల్లె రిజర్వాయర్ ముంపు గ్రామాలైన రామకృష్ణాపురం, బయ్యారెడ్డిపల్లె, చిన్న దేవరకుప్పం, పెద్ద దేవరకుప్పం గ్రామాలకు చెందిన బాధిత రైతులు, ప్రజలతో రామకృష్ణాపురంలో సమావేశం నిర్వహించి, వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. కొందరు రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయని, డీకేటీ భూముల్లో సేద్యం చేస్తున్నామని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్‌కు సంబంధించిన బాధితులకు న్యాయం చేసే విషయంలో జిల్లా స్థాయిలో తాము చేయగలిగేదంతా చేసి, బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలుసార్లు చర్చించి బాధితులకు ఒక రూపాయి ఎక్కువ ఇచ్చేందుకు కృషి చేయాలని, వారికి న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారన్నారు. 2013 ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం ఒక కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అందరికీ ఆమోద యోగ్యంగా ప్యాకేజీ రూపంలో వన్‌టైం సెటిల్మెంట్ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ముంపు గ్రామాల భూములకు సంబంధించి సర్వే నంబర్ల వారీగా రైతులతో మరోసారి సమావేశమై, పరిశీలించి ఈ నాలుగు గ్రామాల్లోని 290 కుటుంబాలకు న్యాయం జరిగేలా మీ సమ్మతితో ముందుకు వెళతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ శివయ్య, ఇరిగేషన్ డీఈఈ ప్రసన్న కుమారి, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, ఎంపీపీ ఈశ్వరయ్య, స్థానిక సర్పంచ్ కోదండరాజు, నేతలు అమాస మోహన్, నాగేశ్వరరావు, గంగాధరం, నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం.. చదువుకు ఊతం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది.. ఇందులో భాగంగానే పేద విద్యార్థులకు పలు పథకాలు అందిస్తోంది. ఇందులో భాగంగానే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ చిన్నారుల చదువుకు ఊతమిస్తోంది. ఆర్టీసీలో ఉచిత రాయితీ పాసుల జారీపై ప్రత్యేక కథనం.

- 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకూ ఉచితం
- దివ్యాంగులు ఉచిత బస్సు పాసులు
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఆర్టీసీ



పల్లెవెలుగు బస్సు



పాసుల జారీ కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

చిత్తూరు రూరల్: జిల్లాలోని ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ బస్సుపాసులను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థుల చదువులకు ఊత మిచ్చేలా ఏటా ఆర్టీసీ బస్సు పాసులు జారీ చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉచిత, రాయితీ పాస్‌ల కోసం ఆన్‌లైన్ ద్వారా ఆర్టీసీ దరఖాస్తులు స్వీకరిస్తోంది.

జిల్లాలో 5 డిపోలున్నాయి. ఈ డిపోల పరిధిలో గతేడాది 37,872 ఉచిత, రాయితీ పాసులు జారీ చేశారు. ఇందులో ఉచిత పాసులు దివ్యాంగులకు 2,664, విద్యార్థులకు 9,721, రాయితీ పాసులు 28,151 ఉన్నాయి. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ. 20 కోట్లు ఖర్చు భరించింది. ఈసారి కూడా ఉచిత పాసుల జారీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం www.apsrtcpass.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఉచిత పాసులు

ఆర్టీసీ ఏటా విద్యార్థులకు ఉచిత పాసులు అందిస్తోంది. బాలురుకు 12 ఏళ్లు నిండే వరకు, బాలికలకు 18 ఏళ్లు నిండే వరకు ఉచిత పాసులను అందిస్తున్నారు. ఈ పాసుల ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకోసం విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి (బోనిఫైడ్ సర్టిఫికెట్) ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. పాస్ ఐడెంటిటీ కార్డు నిమిత్తం రూ.50 చెల్లించాలి.

జిల్లాలో 2022-23 పాసుల జారీ వివరాలు

డిపో	ఉచితం	రాయితీ	దివ్యాంగులు
చిత్తూరు -1	1,769	5,215	612
చిత్తూరు -2	4,104	6,519	1,024
కుప్పం	1,808	7,121	376
పలమనేరు	975	6,961	455
పుంగనూరు	1,065	2,335	197

దివ్యాంగులకు..

ఆర్టీసీ దివ్యాంగులకు ఉచిత పాసులు అందిస్తోంది. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాలి. మూడేళ్ల కాల వ్యవధితో పాసులు జారీ చేస్తారు. ఐడీ కార్డుకు రూ.100 చెల్లించాలి.

రాయితీ పాస్‌లు ఇలా..

చదువుకునే ప్రతిఒక్కరూ ఈ పాస్ పొందవచ్చు. చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాసులు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాస్ జారీ చేస్తారు. కళాశాల నుంచి (బోనిఫైడ్) సర్టిఫికెట్ సమర్పించాలి. విద్యార్థి ఫొటో జత చేయాలి. విద్యార్థి నెలవారీ, మూడు నెలలకోసారి, సంవత్సరం పాస్లు పొందవచ్చు. నెలవారీ పాస్ ఐడీ కార్డుకు రూ.50, క్వార్టర్లీ, ఇయర్లీ పాస్ ఐడీ కార్డులకు రూ.100 చొప్పున చెల్లించాలి.

ప్రయాణం.. సురక్షితం..

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని, ప్రైవేట్ వాహనాల్లో ఎక్కి విద్యార్థులు ప్రమాదాలకు గురికావద్దని అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వాహనాలను తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీలో ప్రయాణమే సురక్షితమంటున్నారు అధికారులు. బస్సుల రాకపోకలలో సమయ పాలన పక్కాగా ఉంటుందని వారు చెబుతున్నారు. ఉచిత, రాయితీ బస్సు పాస్‌లను వినియోగించుకోవాలని కోరుతున్నారు.

ఇది ప్రభుత్వ అవకాశం..



రాష్ట్ర ప్రభుత్వం విద్య వ్యవస్థను ప్రోత్సహిస్తోంది. పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలని ఆర్థికంగా తోడ్పడుతోంది. ఇందులో భాగమే ఆర్టీసీ బస్సు పాసులు అందించే కార్యక్రమం. నిబంధనల మేరకు పాసులు జారీ చేస్తారు. ప్రతి బస్టాండ్‌లోనూ పాసుల జారీ కేంద్రాలున్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – జితేంద్రనాథ్‌రెడ్డి, డీపీటీఓ, చిత్తూరు

మా తోడు నీడ మీరే నాయనా!



పూతలపట్టు(యాదమరి): వర్షం వస్తోంది నాయనా.. తడిసిపోతావేయో.. ఇటు గొడుగు కిందకు రా.. ఎన్నో పథకాలు పెట్టి మా బాగోగులు చూసుకుంటున్న సీఎం జగన్‌బాబు, మా వెన్నంటే ఉంటూ తోడుగా నిలుస్తున్న మీరు(ఎమ్మెల్యే) ఎప్పుడూ చల్లంగుండాలి నాయనా! అంటూ ఓ వృద్ధురాలు ఆప్యాయత కురిపించింది. ఈ ఘటన స్థానికులను ఆలోచింపజేసింది. సోమవారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తవణంపల్లె గ్రామంలో పర్యటించారు. అప్పటికే వర్షం పడుతుండగా.. ఓ వృద్ధురాలు ఇంటికి వస్తున్న ఎమ్మెల్యేకు ఎదురెళ్లి గొడుగుపట్టింది. తర్వాత తన చేతిలో సంక్షేమ బుక్‌లెట్‌పై ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో వంక చూస్తూ 'మీరు పది కాలాలపాటు చల్లంగుండాలి నాయనా..' అంటూ పై విధంగా స్పందించడంతో ఒకింత స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. అనంతరం ఎమ్మెల్యే ఆమెను ఆప్యాయంగా పలకరించి సమస్యలు ఉంటే చెప్పాలని అభ్యర్థించారు.

గజదాడులు.. మామిడి చెట్లు ధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన చెట్లు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులోని ఖాదర్ బాషాకు చెందిన మామిడి తోటలో ఆదివారం రాత్రి ఏనుగులు చెట్లను, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. పది రోజులుగా ఏనుగుల వరుస దాడులతో పంటలకు తీవ్రనష్టం జరుగుతుంది. రోజూ ఎక్కడో ఒక చోట ఏనుగులు పంట పొలాలపై పడి నాశనం చేస్తుండడంతో రైతులు రాత్రి పూట పొలాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు.

ఇంటింటా సర్వేని విజయవంతం చేయండి

- జూన్ 26 నుంచి జూలై 16 వరకు సర్వే
- కరపత్రాలు ఆవిష్కరించిన కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి జూలై 16 వ తేదీ వరకు ఇంటింటా సర్వేని విజయవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన కుష్టువ్యాధి నిర్మూలన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లతో ఇంటింటా సర్వే నిర్వహించాలని చెప్పారు. డీఎం అండ్‌హెచ్‌ఓ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటి సర్వే నిర్వహించి, కుష్టు వ్యాధిగ్రస్తులకు అవసరమైన చికిత్స అందించేందుకు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు బహుళ ఔషధచికిత్స అందించి తొలిదశలోనే వ్యాధిని అరికట్టాలన్నదే సర్వే ప్రముఖ ఉద్దేశమన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, అరిచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని, వేడి వస్తువులను గుర్తించ లేకపోవడం వంటి లక్షణాలతో కుష్టు వ్యాధిని ముందస్తుగా గుర్తించవచ్చన్నారు. ఇటువంటి లక్షణాలు ఉన్నట్‌లైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్దకు వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ రెడ్డెప్ప, డీపీఎంఓ డాక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

ఆరోగ్యమిత్రల సేవలు అభినందనీయం

చిత్తూరు జిల్లాలో సేవామిత్ర అవార్డులను పొందిన ఆరోగ్యమిత్రల సేవలు అభినందనీయమని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సేవామిత్ర అవార్డు పొందిన నలుగురు ఆరోగ్యమిత్రలను కలెక్టర్ అభినందించారు. ఆరోగ్యశ్రీ సీఈఓ, వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్ట్ నుంచి పంపిన రూ.5 వేల నగదు చెక్కులు, ప్రశంసా పత్రాలను ఆరోగ్యమిత్రలకు అందజేశారు. వైద్య అవసరాల కోసం వచ్చే పేద ప్రజలకు ఆరోగ్య మిత్రలు మంచి సేవలందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాల మేరకు విధులు నిర్వహించి, పేదలకు మేలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవామిత్ర అవార్డులు పొందిన ఆదినారాయణస్వామి, లోకేష్, ధనశేఖర్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

సదుం: ఓ వివాహితను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతి సోమవారం తెలిపారు. ఊటుపల్లెకు చెందిన ఓ వివాహితకు మాయమాటలు చెప్పి కొడుకు వరస అయ్యే రాయచోటికి చెందిన నాగరాజు ఆభరణాలు, రూ. 80 వేలు నగదు తీసుకున్నాడు. దీనిని తిరిగి చెల్లించాలని ఆమె కోరగా తనతో సహజీవనం చేస్తేనే ఇస్తానని, లేకపోతే దుష్ప్రచారం చేస్తానని వేధిస్తుండడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

నరకాసురుడినైనా నమ్మచ్చు కానీ.. చంద్రబాబును నమ్మలేం

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం): నరకాసురుడినైనా నమ్మొచ్చు కానీ నారా చంద్రబాబును మాత్రం నమ్మలేం అని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో సీఎం జగన్ రాష్ట్రాన్ని శ్రీలంకలా మార్చేస్తున్నారంటూ ప్రభుత్వంపై విషం కక్కిన చంద్రబాబు, ఎల్లో మీడియా నేడు అదే సంక్షేమ పథకాలతో మేనిఫెస్టోను విడుదల చేయడమేమిటని ప్రశ్నించారు. ఇది వారి మానసిక స్థితికి అద్దం పడుతోందని చెప్పారు. గతంలో 600 హామీలతో మేనిఫెస్టోని విడుదల చేసి, అందులో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని గుర్తుచేశారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు రాజకీయ పరిపక్వత లేదని, ఆయన రాజకీయాలకు పనికిరారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో అడుగుపెట్టాలన్న స్వార్థ ప్రయోజనం తప్ప పవన్‌కు మరో ఆలోచన లేదన్నారు. ప్యాకేజీకి అలవాటు పడిన పవన్ మాటల్లో నిలకడ లేదన్నారు. ఒకసారి సీఎం అభ్యర్థిని నిర్ణయిస్తామని, మరోసారి తాను ఎమ్మెల్యే అయితే చాలని, ఇంకోసారి గెలుస్తానన్న నమ్మకం లేదని, తనకు ప్రాణహాని ఉందని రోజుకో మాట మాట్లాడుతున్నారని గుర్తుచేశారు. 'మీ ఇంట్లో మంచి జరిగితేనే నావైపు నిలబడండి' అని చెబుతున్న ఏకైన సీఎం వైఎస్ జగన్ అని ఆయన స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వడమాలపేటలో పార్కు ఏర్పాటుకు భూమిపూజ

పుత్తూరు రూరల్ : వడమాలపేట ప్రజల చిరకాల స్వప్నమైన పార్కు ఏర్పాటుకు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చేసిన కృషి ఫలించిందని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంఎస్ఆర్ గార్డెన్స్‌కు చెందిన ఎకరా స్థలంలో సోమవారం పార్కు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి రోజా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో చర్చించి రూ.39 లక్షలు మంజూరు చేయించినట్లు వివరించారు. టెండర్లు పూర్తయిన నేపథ్యంలో నేడు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పచ్చదనం, పిల్లల ఆట వస్తువులు, పెద్దల వాకింగ్ ట్రాక్ వంటి వసతులతో వడమాలపేట ప్రజలకు ఉద్యానవనం త్వరలో అందుబాటులోకి రానున్నదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఉపేంద్రరాజ్, లోకేశ్వర్‌రెడ్డి, పీఎంసీ వైస్ చైర్మన్ శేఖర్, మండల పార్టీ కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, సచివాలయ కన్వీనర్ సురేష్‌రాజు, పార్టీ నాయకులు సుధీర్‌రెడ్డి, ఉమాపతి, నందయ్య, మధురాజు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పూతలపట్టులో 21న రెవెన్యూ సదస్సు

చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 21వ తేదీన నియోజకవర్గ కేంద్రమైన పూతలపట్టులో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సును ప్రజలు వినియోగించుకోవాలన్నారు. దూరప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి అర్జీదారులు వచ్చే పని లేకుండా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుల్లో రెవెన్యూ అర్జీలు మాత్రం స్వీకరిస్తామన్నారు. సదస్సుకు నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, సర్వేయర్‌లు, వీఆర్వోలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు.

అడ్మిషన్‌ల పెంపునకు చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్ అడ్మిషన్ల పెంపునకు చర్యలు చేపట్టాలని డీఈఓ విజయేంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–23 విద్యాసంవత్సరంలో జిల్లాలో గుర్తించిన హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిందన్నారు. ఆ పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నమోదు చేయించాలని పేర్కొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



సమావేశంలో పాల్గొన్న మేయర్ అముద

జిల్లా క్రిష్టియన్ మైనారిటీ సంక్షేమ సంఘం ఎన్నిక

చిత్తూరు రూరల్: అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నగర మేయర్ అముద అన్నారు. చిత్తూరు నగరంలోని అంబేడ్కర్ భవనంలో సోమవారం చిత్తూరు జిల్లా క్రిష్టియన్ మైనారిటీ సంక్షేమ సంఘం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాన్సన్ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆ సంఘం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. జిల్లా అధ్యక్షుడిగా జాషువ, జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అములు చేస్తున్నారని చెప్పారు. ఈ ఫలితంగా క్రిష్టియన్ మైనారిటీ ప్రజలు ఆ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు లోకేష్ రెడ్డి, భూపేష్‌గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

25న న్యాయశాఖ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

తిరుపతి లీగల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోని న్యాయశాఖ ఉద్యోగ సంఘ కార్యవర్గ పదవులకు ఈనెల 25వ తేదీ చిత్తూరులోని పాత కోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు న్యాయశాఖ ఉద్యోగులు సోమవారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోని వివిధ కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సూపరింటెండెంట్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, స్టెనోలు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగులు అటెండర్లు, ప్రాసెస్ సర్వర్లకు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదన్నారు. మొత్తం 534 మంది న్యాయశాఖ ఉద్యోగులు ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. 11 పోస్టులకు 24 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. సుమారు 13 సంవత్సరాలకు పైగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతూ వచ్చాయన్నారు. అయితే ప్రస్తుతం 13 యేళ్ల తరువాత ఎన్నికలు జరుగుతుండడంతో అభ్యర్థులు ప్రచారం తీవ్రంగా చేస్తున్నారు. ముఖ్యంగా అధ్యక్ష పదవికి చిత్తూరుకు చెందిన గోపీనాథ్ రెడ్డి, తిరుపతికి చెందిన మజ్జిగ చంద్రశేఖర్ పోటీలో ఉన్నారు. సోమవారం పోటీలో ఉన్న అభ్యర్థులు కోర్టు విరామ సమయంలో ప్రచారం నిర్వహించారు. న్యాయశాఖ ఉద్యోగులు గంగిరెడ్డి, షాజిద్‌బాషా నరేష్, రవి, శ్రీనివాసరాజు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

లడ్డూ పోటు పనులు త్వరగా పూర్తి చేయాలి



లడ్డూ పోటు భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, తదితరులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో నూతన లడ్డూ పోటు భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు పేర్కొన్నారు. సోమవారం ఆలయ చైర్మన్, ఈఓ నూతనంగా నిర్మిస్తున్న పోటు భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం ఆలయ ఈఈ వెంకటనారాయణ, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డితో మాట్లాడుతూ భవన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. బస్టాండ్ పరిధిలో షాపింగ్ కాంప్లెక్స్ పనులకు స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆలయ చైర్మన్, ఈఓ మాట్లాడుతూ రూ.4.80 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన లడ్డూ పోటు భవనం పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయని, ఆగస్టు నెలలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే ఆలయ అభివృద్ధిలో భాగంగా మాస్టర్ ప్లాన్‌లో ఉన్న పనులన్నీ త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

గుడిపాల: సుమారు 70 గ్రాముల బంగారం చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గుడిపాల మండలం వెంగమాంబపురం కాలనీకి చెందిన సాల్‌మాన్(34) ఈ నెల 15వ తేదీ రాత్రి ఏఎల్ పురం గ్రామానికి చెందిన ద్రాక్షాయణి ఇంటి గడపలో నిద్రిస్తుండగా సుమారు 64 గ్రాముల బంగారాన్ని చోరీ చేశాడు. అలాగే ఆ పక్కనే ఉన్న జగన్నాథం ఇంట్లోకి చొరబడి ఆరు గ్రాముల బంగారాన్ని అపహరించాడు. ఈ విషయమై ఈ నెల 16వ తేదీన గుడిపాల పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ ఏఎల్‌పురం గ్రామానికి చేరుకుని ఘటనాస్థలాలను పరిశీలించారు. అనంతరం జగన్నాథం ఇంటి వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా చోరీకి పాల్పడిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన సాల్‌మాన్ అని గుర్తించారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా అప్పటికే సుమారు 40 గ్రాముల బంగారాన్ని చిత్తూరులోని అటికా ఫైనాన్స్‌లో కుదువపెట్టి రూ.2 లక్షలు తీసుకున్నట్లు అంగీకరించాడు. మిగిలిన 30 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేసి, సోమవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరుఅర్బన్: తవణంపల్లె మండలంలో వెంగంపల్లెలో ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి, అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశారు. సీఐ కథనం మేరకు.. ముందస్తు సమాచారం మేరకు తవణంపల్లె మండలం వెంగంపల్లెలో దాడులు చేశారు. ఆ సందర్భంగా గ్రామానికి చెందిన శ్యాంప్రసాద్‌రెడ్డి (50) అనే వ్యక్తి 39 బాటిళ్ల కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఈబీ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, కిరణ్ మోహన్, మమత పాల్గొన్నారు.



అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

ముగిసిన ఎంఈఓ-2 పోస్టుల భర్తీ ప్రక్రియ

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 66 మంది ఎంఈఓ–2 ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల ఎంఈఓ–2 పోస్టుల భర్తీ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కాగానే వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి ఎంఈఓ–2 నియామకాల ఉత్తర్వులను జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు.. రంగనాథయ్య (రేణిగుంట), కోటేశ్వరయ్య (పూతలపట్టు), భాస్కర్ (తొట్టంబేడు), జయవేలు (ఆర్‌సీ పురం), భాస్కర్ నాయక్ (తిరుపతి అర్బన్), రాజగోపాల్ (మదనపల్లె), గోవిందస్వామి (నారాయణవనం), బాలసుందరం (పలమనేరు), భీమేశ్వరాచారి (బి.కొత్తకోట), బాలయ్య (శ్రీకాళహస్తి), ఎం. శ్రీనివాసులు (గంగవరం), డి. శ్రీనివాసులు (రొంపిచెర్ల), నారాయణ (నిమ్మనపల్లె), వెంకటలక్ష్మి (వాల్మీకిపురం), బాలసుబ్రహ్మణ్యం (పుత్తూరు), పద్మావతి (పీలేరు), ఎం.శ్రీనివాసులు (కురబలకోట), దయాకరరావ్ (ఏర్పేడు), మునిసుబ్రహ్మణ్యం (బీఎస్.కండ్రిగ), ఎస్. తులసీరామ్ (వడమాలపేట), శంకరయ్య(తిరుపతి రూరల్), భాస్కర్ బాబు (చంద్రగిరి), ఆర్.తులసీరామ్ (పెద్దపంజాణి), మోహన్ (చిత్తూరు), హెచ్‌ఎల్‌ఎన్. ప్రసాద్ (యాదమరి), సతీష్‌బాబు (ఎర్రావారిపాళెం), తాతయ్య (పులిచెర్ల), భాస్కరనాయుడు(పెనుమూరు), యుగంధర్‌రాజు(పిచ్చాటూర్), లింగయ్య (పాకాల), గౌస్‌పీర్ (పీటీఎం), తిరుమల (చౌడేపల్లె), శివరత్నమ్మ (సోమల), నాగసుబ్బరాయుడు (తంబళ్లపల్లె), దామోదరమ్ (వెదురుకుప్పం), ఎం.గణపతి (గుడిపల్లి), రమేష్‌బాబు (బంగారుపాళెం), లక్షయ్య(గుడుపల్లె), దామోదర (సదుం), నాగార్జున (కలికిరి), సుబ్బారెడ్డి (గుర్రంకొండ), రామచంద్రారెడ్డి (కలకడ), శ్రీధరరాజు (నింద్ర), గుణశేఖర్‌రెడ్డి (జీడీనెల్లూరు), మనోజ్‌కుమార్ (కార్వేటినగరం), ఆంజనేయులు (రామసముద్రం), ఉష (సత్యవేడు), నమశివాయ(నగరి), మురుగేష్ (వి.కోట), సుబ్రహ్మణ్యంరెడ్డి (కేవీ పల్లె), డి.శంకరయ్య (ములకలచెరువు), జనార్దనరాజు (నాగలాపురం), త్యాగరాజరెడ్డి (తవణంపల్లె), సబర్మతి (ఎస్ఆర్ పురం), రెడ్డెన్నశెట్టి (పుంగనూరు), దామోదరనాయుడు (ఐరాల), హరిప్రసాద్‌వర్మ (విజయపురం), రవికుమార్ (కేవీబీపురం), నారాయణ (రామకుప్పం), గున్నయ్య (వరదయ్యపాళ్యం), గిరిజ (పాలసముద్రం), రాజారామ్ (కుప్పం), నౌషాద్ (బైరెడ్డిపల్లె), గోవిందరాజులు (శాంతిపురం), గోపీనాథ్ (చిన్నగొట్టిగల్లు) మండలాలకు ఎంఈఓ–2 లుగా నియమించినట్లు పేర్కొన్నారు.

వక్ఫ్‌బోర్డుకు నివేదిక సమర్పణ



మసీదుల సందర్శనలో పాల్గొన్న వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు, ఇతరులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వక్ఫ్‌బోర్డుకు నివేదిక సమర్పించినట్లు ఆ బోర్డు జిల్లా అధ్యక్షుడు రహమతుల్లా, ఉపాధ్యక్షుడు గఫార్‌ఖాన్ తెలిపారు. వారు సోమవారం నగరంలోని పలు మసీదులను సందర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇమామ్, మౌజాన్‌ల గౌరవవేతనం, మసీదుల్లో మౌలిక వసతుల కల్పనపై వక్ఫ్‌బోర్డుకు నివేదిక ఇచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా 232 మసీదుల్లో ఇమామ్, మౌజాన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవవేతనం ఇస్తోందన్నారు. మరికొన్ని మసీదుల్లో ఉన్న ఇమామ్, మౌజాన్‌లకు గౌరవవేతనం ఇవ్వాలని పలువురు వినతులు ఇచ్చారన్నారు. ఆ వినతుల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ఫిరోజ్, నగరపాలక కోఆప్షన్ సభ్యుడు అను, సయ్యద్, మున్నా, వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎక్కువ మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ గుణశేఖర్ రెడ్డి, డీఆర్డీఏ, పీడీ తులసి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మితో యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్, టెక్‌బీ సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. హెచ్‌సీఎల్, టెక్‌బీ సంస్థ నిర్వహించే పరీక్షలో పాస్ అయిన వారికి ఆరు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో నెలకు రూ.10 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆరు నెలలు శిక్షణ పూర్తి చేసిన వారు ఫుల్ టైం ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు.